విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు

ఖైరతాబాద్, మార్చి 12 : రాష్ట్ర బడ్జెట్లో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాల్లోనూ విద్యకు బడ్జెట్లో 12 నుంచి 13 శాతం కేటాయిస్తుంటే తెలంగాణలో మాత్రం గత బడ్జెట్లో కేవలం ఏడు శాతం మాత్రమే కేటాయించిందని, అందులో పూర్తిగా కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ నిధులు రూ.8వేల కోట్లు పెండింగ్లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలన్నారు. నేటికీ అనేక గురుకులాలు, డిగ్రీ, ఐటీఐ కళాశాలలకు పక్కా భవనాలు లేవన్నారు. టీచింగ్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో బోధన చేసే వారు కరువయ్యారన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు అలివేలు, రాజు, కల్యాణి, శ్రీరామ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన పెంచు కోవాలి



నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అతిథులకు సత్కారం చేస్తున్న విజయ్ కుమార్

హిమాయత్ నగర్ , మార్చి12: వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతపై జాగ్రత్తలు పాటించాలని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ్ కుమార్, హైకోర్టు న్యాయవాది వేమూరి గౌరీశంకర్ రావు, కాక్టో అధ్యక్షుడు శంకర్ లాల్, ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్ అన్నారు. బుధవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో వస్తువుల అమ్మకాలు – కొనుగోలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్య మైన వస్తువులు పొందడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని మోసపోకుండా ఏదైనా వస్తువు కొనుగోలు చేసేముందు నాణ్యతను పరిశీలించి తీసుకోవడంతో పాటు ఆ వస్తువుకు రశీదును సైతం అడిగి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాపోలు శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస రావు , డాక్టర్ నర్సిహులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా.. కృషి చేస్తా

- రూ 81 కోట్లతో నార్సింగి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు
- ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్

మణికొండ, మార్చి 12 : నార్సింగి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పాటుపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్గౌడ్ అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 81 కోట్ల మున్సిపాలిటీ నిధులతో అభివృద్ధి పనులకు తీర్మానాలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో నార్సింగ్ మున్సిపాలిటీ ముందుందని తెలిపారు. నవ నగరంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని దేశ నలుమూలల నుంచి ఈ ప్రాంతాలలోకి జనం వచ్చి స్థిరపడుతున్నారని ప్రజా అవసరాలను గుర్తించి నిధులను కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రహదారుల విస్తీర్ణం ట్రాఫిక్ రద్దీ నియంత్రణ ప్రజా అవసరాలను గుర్తిస్తూ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

మున్సిపాలిటీ తీర్మానానికి రూపొందించిన ప్రణాళికలు

- రూ.20 కోట్లతో కోకాపేట్ విజేత సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న బ్రిడ్జి నిర్మాణంతో పాటు అప్రోచ్ రోడ్డు అభివృద్ధి సుందరీకరణ
- రూ.11.50 కోట్లతో రాయల్ ఫంక్షన్హాల్ నుంచి నార్సింగ్ జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డు వెడల్పు , ఫుట్ పాత్ నిర్మాణం డివైడర్ నిర్మాణం.
- రూ 13 కోట్లతో కోకాపేట్ సర్కిల్ నుంచి గండిపేట్ సాయిబాబా గుడి వరకు బీటీ రోడ్డు వెడల్పు ఫుట్పాత్ నిర్మాణం డివైడర్ నిర్మాణం



నార్సింగి మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై అధికారులతో కలిసి సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్గౌడ్

- రూ.10 కోట్లతో మంచిర్యాల బాలాజీ నగర్ యందు మెయిన్ రోడ్డు కల్వర్టు నుంచి మూసీ నది వరకు బాక్స్ నిర్మాణం
- రూ 1.50 కోట్లతో నార్సింగి యందు ఆవు దూడ జంక్షన్ నిర్మాణం
- రూ. 8 కోట్లతో నార్సింగ్లో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయుట.
- రూ 5 కోట్లతో నార్సింగిలో మూడు ఎకరాలలో పిల్లలకి, పెద్దలకి అనువుగా తగిన సౌకర్యాలతో పార్కుని ఏర్పాటు చేయుట.
- అల్లు స్టూడియో నుంచి గ్లోబల్ హెడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం
- మంచిరేవులలో 2 జంక్షన్ల నిర్మాణం
- పుల్కాపూర్ నాలా పునరుద్ధరణ
- నార్సింగి పురపాలక సంఘ పరిధిలో ఇదివరకే మొదలు పెట్టి అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తి చేయుట
- నార్సింగియందు రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేయుట

పనులన్నీ త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ టి కృష్ణమోహన్ రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్, నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ టి కృష్ణమోహన్ రెడ్డి, డి ఈ నరేష్కుమార్, ఏ ఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేశం , నార్సింగి మున్సిపాలిటీ మాజీ చైర్పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ విజయ్ బాబు, మాజీ కౌన్సిలర్లు శివారెడ్డి, లక్ష్మీ ప్రవళిక, జి. అమరేందర్ రెడ్డి, ఏ. దుర్గేష్ యాదవ్, నార్సింగ్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు అసెంబ్లీలో మాట్లాడాలని ఎమ్మెల్యే ప్రకాశ్గౌడ్ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మైలార్దేవ్పల్లి, మార్చి 12:ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇస్తామన్న ఏ ఒక్క హామీనీ అమలు చేయకుండా మోసం చేస్తుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్గౌడ్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ పిలుపు మేరకు అన్ని నియోజకవర్గ ఎమ్మెల్యేలను కలిసి తమ డిమాండ్లపై అసెంబ్లీలో మాట్లాడాలని వినతిపత్రం అందజేశామన్నారు. మార్చి 19న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామన్నారు. రాష్ట్రవాప్తంగా 8 నెలలగా పెండింగ్లో ఉన్న గుడ్ల బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 వేల వేతనం అమలు చేయాలన్నారు. ప్రతి స్కూల్కు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలన్నారు. అవసరమైన గ్యాస్ను సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వవద్దు అన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో వై.స్వప్న, రమ్య, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేత

సాఫ్ట్వేర్ సొల్యూషన్ కంపెనీ అయిన బడియా జెన్కు చెందిన ప్రతినిధుల బృందం బుధవారం బోరబండలోని ప్రభుత్వ నాట్కో పాఠశాలను సందర్శించడం జరిగింది. కంపెనీకి చెందిన యూకే ప్రతినిధి క్లయిర్నీ తమ బృందంతో కలిసి పాఠశాలలో వసతులను పరిశీలించారు. అనంతరం 50 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ను అందజేశారు. సంస్థ ప్రతినిధులు శ్రీధర్, అది, ప్రదీప్, సుకన్య, పునీత్, స్కూల్ హెచ్ఎం గీత తదితరులు పాల్గొన్నారు. – ఎర్రగడ్డ, మార్చి 12:

డంపింగ్యార్డు పరిశీలన

శంషాబాద్ రూరల్, మార్చి 12 : శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్గూడ రెవెన్యూపరిధిలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ సుమన్రావుతో కలిసి రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్గూడ రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన డంపింగ్యార్డు పొగతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మానసహిల్స్, ప్రెస్టేజ్ కాలనీలోని కొందరు ఫిర్యాదులు చేయడంతో పరిశీలించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డును మరోచోట ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలంపై ఆరా తీసినట్లు అధికారులు తెలిపారు. పరిశీలించిన వారిలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య, పలువురు అధికారులు ఉన్నారు.

వంట కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలి

హిమాయత్నగర్,మార్చి12: వంట కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న విధానం, వంట కార్మికుల పరిస్థితులను అధ్యాయనం చేసి విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వంట కార్మికుల వేతనాల అంశం లేకపోవడం అన్యాయమన్నారు. బకాయి ఉన్న వేతనాలు మంజూరు చేయాలని కోరారు. మార్కెట్లో పెరిగిన ధరల వల్ల మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులకు అదనంగా ఆర్థిక భారం పడుతుందని, నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లు, వంట గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్యూమరేటర్లకు రూ.10వేలు ఇవ్వాలి

హిమాయత్ నగర్ , మార్చి12: గ్రేటర్ హైదరాబాద్లో కులగణన సర్వే చేసిన ఎన్యూమరేటర్లకు చెల్లించాల్సిన రూ. 10వేలకు తక్షణమే ఇవ్వాలని జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్ ప్రభుత్వాన్ని బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశా రు.సర్వే పూర్తై నెలలు గడుస్తున్నా డ బ్బులు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎన్యూమరేటర్లకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 14న 'దక్షిణ భారత రథయాత్ర'

ఖైరతాబాద్, మార్చి 12 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్, ఆల్ డిఫెన్స్ ఎస్టాబ్లిష్మెంట్స్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్తాధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి భారత రాజ్యాంగ రక్షణ కోసం దక్షిణ భారత రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ చీఫ్ సెక్రటరీ జనరల్ ఎం. నర్సింగ్రావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్క్లబ్లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాజ్యాంగ రక్షణే ధ్యేయంగా ఏప్రిల్ 14న 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి రథయాత్ర ప్రారంభమై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర మీదుగా నాగ్పూర్ వరకు సాగుతుందని, అక్కడ దీక్షా భూమి వద్ద సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం రథయాత్రకు సంబంధించిన పోస్టర్లను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ జాతీయ సెక్రటరీ జనరల్ జి. శంకర్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. రాజలింగం, ఎస్. మునికుమార్ కోశాధికారి పి. కన్నయ్య, జై భీమ్ సంక్షేమ సంఘం సలహాదారులు బి. పద్మతో కలిసి ఆవిష్కరించారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు

పట్టించుకోని అధికారులు... ప్రజలకు తప్పని తిప్పలు

శంషాబాద్ మున్సిపాలిటీలోని 14వ వార్డు ఇంద్రారెడ్డి కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన మిషన్భగీరథ ట్యాంకుకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నేరుగా నీటిని తీసుకొచ్చి నర్కూడ, సుల్తాన్పల్లి, కవ్వగూడ, కేబీదొడ్డి, చౌదర్గూడ గ్రామాలకు తాగునీటిని నరఫరా చేస్తారు. దీంతో పాటు శంషాబాద్ మున్సిపాలిటీలోని ఔటర్రింగ్రోడ్డు లోపలి ప్రాంతాలకు రాళ్లగూడ, ఎయిర్పోర్టు కాలనీ, కొత్వాల్గూడ,యాదవ్కాలనీ, జై భవానీ కాలనీ, ప్రకాశ్నగర్, ఫోర్టుగ్రాండ్ తదితర కాలనీలలోకి తాగునీటిని అందించాలి. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మిషన్భగీరథ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ... పట్టించుకోకపోవడంతో ఇంద్రారెడ్డి కాలనీలోని మిషన్ భగీరథ ట్యాంకు నుంచి నిత్యం నీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని వృథాగా పోకుండా అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. – శంషాబాద్ రూరల్, మార్చి 12:

పార్కు స్థలం స్వాధీనం

బండ్లగూడ, మార్చి 12: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవానీనగర్ కాలనీలో కొందరు కబ్జా కోరులు నకిలీ పత్రాలు సృష్టించి పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్రలు చేశారు. విషయం తెలుసుకున్న భవానీనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పార్కు స్థలాన్ని కబ్జా కోరుల నుంచి కాపాడుకున్నారు. బుధవారం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి వాణి సమక్షంలో పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేశారు. ఇందుకు కాలనీ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

అదృశ్యమైన తల్లీకూతురు (ఫైల్)

శంషాబాద్ రూరల్, మార్చి 12 : తల్లీ కూతురు అదృశ్యమైన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్గఢ్ రాష్ట్రానికి చెందిన బాబులు భాస్కర్ అతడి భార్య ముగ్గురు పిల్లలతో కలిసి శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామానికి వలసవచ్చి రాజీవ్గృహకల్పలో నివాసముంటున్నాడు. ఈనెల 10న ఉదయం 8 గంటల సమయంలో పని చేయడానికి వెళ్లిన భాస్కర్ సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తల్లీకూతురు కనిపించలేదు. దీంతో భార్య శివ కుమారి భాస్కర్(30), చిన్నకూతురు లాబియా భాస్కర్(2) ఇద్దరి కోసం చుట్టు పక్కల ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

బండ్లగూడ, మార్చి 12: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్నా స మాచారం మేరకు పోలీసులు వారిని పట్టుకున్నారు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ వైపునకు వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న స మాచారం మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అక్కడికి చేరుకొని వాహనాన్ని తనిఖీలు చేశారు. ఆ వాహనంలో 1600 కిలోల బియ్యం, 800 కిలోల గోధుమలను అక్రమం గా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు బియ్యంతో పాటు వాహనాలు పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

తాగునీటి ఎద్దడిని పరిష్కరించండి

జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న పి. వి. రవిశేఖర్ రెడ్డి

వెంగళరావునగర్, మార్చి 12 : మంచినీటి ఎద్దడి సమస్యను వెంటనే పరిష్కరించాలని వెంగళరావునగర్ డివిజన్ వాటర్ వర్క్స్ మేనేజర్ సూర్యప్రకాశ్ను కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి. రవిశేఖర్ రెడ్డి కోరారు. బుధవారం వెంగళరావునగర్ వాటర్వర్క్స్ కార్యాలయానికి వెళ్లి వేసవిలో మంచినీటి సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే తాగునీరు చాలకపోవడంతో నెల రోజుల నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ (jails) రంగారావు, సీనియర్ సిటిజెన్ ఫోరం ఉపాధ్యక్షుడు సారంగ రావు, హైకోర్టు న్యాయవాది లక్ష్మీకాంతారావు,వాస్తు శిల్పి వెన్ను అశోక్ కుమార్,మైనార్టీ నాయకుడు గౌస్ ఖాన్,నాగరాజు,కాలనీ పెద్దలు సాంబయ్య,ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి వ్యక్తుల అరెస్టు

మైలార్దేవ్పల్లి, మార్చి 12: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని మైలార్దేవ్పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్దేవ్పల్లి డివిజన్ లక్ష్మీగూడలోని వైట్ బిల్డింగ్ ప్రాంతంలోని నిర్మానుష ప్రాంతంలో గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. పల్లెచెరువు ప్రాంతానికి చెందిన సయ్యద్ అర్షద్, లక్ష్మీగూడకు చెందిన మహ్మద్ ఖాజా సోహెల్, కోఠికి చెందిన ఎండీ సలీమ్, రాంనగర్కు చెందిన ఎండీ అమీర్లు నిర్మానుష ప్రాంతాలను ఎంచుకొని గంజాయి సేవిస్తున్నార న్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు.

ఇందులో 300 గ్రాముల గంజా యి, మూడు బైక్లు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. ఈ గంజాయి విక్రేతల దాడిలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ మక్సూద్ ఆలీ, ఎస్సైలు పైడి నాయుడు, చంద్రకాంత్, వెంకటరమణ, గోవర్ధన్, నందు, వంశీ, జంగ య్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

నా భర్త చావుకు..కారణమైన వారిని శిక్షించండి

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న శ్రీలత

ఖైరతాబాద్, మార్చి 12: తన భర్త చావుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్పేట మండలం యాచారం గ్రామానికి చెందిన బాధితురాలు శ్రీలత కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ భర్త బాలరాజు (32), కుమారుడు (3), ఇద్దరు కవలలు (2) ఉన్నారన్నారు. మూడేండ్ల నుంచి తమ కుటుంబ సభ్యుల మధ్య భూ తగాదాలు ఉన్నాయని, తన భర్తకు రావాల్సిన భూమి తన ఆడబిడ్డల పేరిట తప్పుడు రిజిస్ట్రేషన్ రాయించుకున్నారన్నారు. దీనిని నిలదీసినందుకు తన భర్తపై అనేక విధాలుగా దాడులు చేశారన్నారు. 2023 సెప్టెంబర్ 14న తమకున్న పొలం వద్ద నీళ్లు పెట్టడానికి వెళ్లగా విద్యుదాఘాతానికి గురైనట్లు తనకు ఫోన్ వచ్చిందని, వెంటనే ఆయనను గాంధీ ఆస్పత్రిలో చేర్పించానన్నారు. అదే నెల 23న తన భర్త చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. తన భర్త ఒంటిపై కాలిన గాయాలున్నాయని, ఆయన చావుపై తనకు అనుమానం ఉందని, ఈ మేరకు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. దీంతో తన కుటుంబ సభ్యులను తీసుకొని పోలీసు స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తే ఎఫ్ఐఎఆర్ నమోదు చేశారన్నారు.

కాని ఇప్పటి వరకు బాధ్యులను కనిపెట్టి శిక్షించలేదన్నారు. ఉన్నతాధికారులను కలిసినా ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వమే తనకు న్యాయం చేయాలని కోరారు.

నెమలినగర్లో సమస్యలు పరిష్కరించాలి

నెమలినగర్లో సమస్యలు పరిష్కరించలని గండిపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

మణికొండ, మార్చి 12 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెమలి నగర్ కాలనీలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం గండిపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్, రేషన్ కార్డులు, వృద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్, రహదారులు సరిగ్గా లేక, బస్సులు రాక, తాగేందుకు నీరు రాక నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 2000 మంది జనాభా ఉన్న ఈ ప్రాంతానికి ప్రధాన రహదారి లేక అవస్థలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సర్వే నంబర్ 290 లో 419 ఇళ్ల పట్టాలను గతంలో ఇచ్చారని , కానీ ఇచ్చిన పట్టాల కన్నా అదనంగా కొంతమంది ప్రజా ప్రతినిధులు, స్థానిక కాలనీవాసులు సర్కార్ స్థలాలను ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్నారని వాటిని తక్షణమే తొలగించి చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. స్పందించిన తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నాగేష్గౌడ్. లక్ష్మణ్ కుమార్ గౌడ్ పార్టీ సభ్యులు రఘు. రామాంజనేయులు.మహేష్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కాటేదాన్లో..కార్డెన్ సెర్చ్

కాటేదాన్లో నిర్వహించిన కార్డెన్సెర్చ్లో స్థానికులతో మాట్లాడుతున్న ఇన్స్పెక్టర్ నరేందర్

మైలార్దేవ్పల్లి, మార్చి 12: నిషేధిత గుట్కాలు, గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టామని..వాటిని ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మైలార్దేవ్పల్లి పోలీస్స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేందర్ తెలిపారు. కాటేదాన్లో ఇన్స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కాటేదాన్ పారిశ్రామికవాడలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ పోలీసుల సహకారంతో వాహనాల తనిఖీలు, కిరాణా షాపులలో నిషేధిత గుట్కా, గంజాయి విక్రయాలపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నరేందర్ మాట్లాడుతూ కాటేదాన్ పారిశ్రామిక వాడలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తుంటారన్నారు. ప్రతి ఒక్కరి భద్రత దృష్ట్యా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సరైన దస్తావేజులు, లైసెన్స్ లేని వాటిని సీజ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్దేవ్పల్లి లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

బంగారం కాజేసిన దొంగ అరెస్టు

ఖైరతాబాద్ : తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలను దొంగలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కర్నూల్ జిల్లా నందవరం మండలం, సోమలగూడూరు గ్రామానికి చెందిన షేక్ కలందర్ (31) నిరుద్యోగి. 2015లో పని కోసం హైదరాబాద్కు వచ్చాడు. ఎక్కడా పని దొరక్కపోవడంతో పాటు దురు అల వాట్లకు బానిసై దొంగగా మారాడు. ఇటీవల ఖైరతా